

సోమశిలలో 72.603 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 72.603 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 2,988 క్యూసెక్కుల వరద వస్తుండగా, డెల్టాకు 2,550, ఉత్తరకాలువకు 500, కండలేరుకు 1,200, దక్షిణకాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.79,410
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,185
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,401
సవర (8 గ్రాములు)	రూ.59,208

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.6 /25.1

జిల్లాలో బుధవారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 80 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

22న అండర్-12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-12 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లతో ఈ నెల 18వ తేదీ సాయంత్రంలోపు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని క్రికెట్ క్రీడా ప్రాంగణంలోని కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94405 36270 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేగంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు

• కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో నిర్మాణంలో ఉన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్ జిల్లా స్థాయి సలహా కమిటీ తొలి సమావేశం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ హార్బర్‌లో ఇప్పటికే ఎక్కువ శాతం పనులు పూర్తి చేశారన్నారు. మిగతా పనులు రాబోయే 4 నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌పీ బోట్ల సంఘాలు, యాంత్రిక బోట్ల సంఘాలు, ఫిష్ మార్కెటింగ్ కొనుగోలుదారులు, ఎగుమతి దారుల సంఘాల ఏర్పాటు, వారి ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. మత్స్య సంపద క్రయవిక్రయాలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఎంపెడా అధికారులను ఆదేశించారు. హార్బర్ నిర్వహణకు వసూలు చేయాల్సిన బెర్తింగ్ చార్జీలు, గిడ్డంగి అద్దెలు, లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త, ఏపీ మారిటైం బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుజిత్‌కుమార్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఎంపెడా ప్రతినిధి మురళీమోహన్, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వీవీఆర్ బాబు, మెరైన్ స్టేషన్ ఎస్సై నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లతో ఆత్మగౌరవం

• జేసీ కార్తీక్



లబ్ధిదారుడిని సన్మానిస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు (అర్బన్): గ్రామీణ ప్రజలు మరుగుదొడ్లను వినియోగించడం ద్వారా ఆత్మగౌరవం పెరుగుతుందని, ఆరోగ్యవంతంగా జీవించ వచ్చని జేసీ కార్తీక్ అన్నారు. ప్రపంచ టాయిలెట్ దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు మరుగుదొడ్ల వినియోగం పునాది వంటిదన్నారు. జిల్లాలో బహిర్భూమికి ఎవరూ వెళ్లకూడదనే లక్ష్యాన్ని 100 శాతం చేరుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. సామాజిక మరుగు దొడ్లను నిర్మించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలో ఉత్తమ మరుగుదొడ్ల లబ్ధిదారులను, ఉత్తమ సామాజిక శానిటరీ కాంప్లెక్స్‌లకు పురస్కారాలు అందజేశారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఈ వెంకటరమణ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నెల్లూరు (లీగల్): బాలికతో లైంగిక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు పోతురాజు మీరయ్యకు జీవిత ఖైదుతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. మనుబోలు మండలం పిడూరుమిట్ట గ్రామానికి చెందిన పోతురాజు మీరయ్య చిల్లర అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బాలిక అంగడికి వెళ్తున్నప్పుడు మాయమాటలు చెప్పి లైంగిక సంబంధం పెట్టుకుని గర్భవతిని చేశాడు. బాధిత బాలిక 12-01-22వ తేదీన మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు పోతురాజు మీరయ్యను అరెస్ట్ చేశారు. విచారణలో మీరయ్య నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వూరు శైలజారెడ్డి వాదించారు.

రాళ్లపాడుకు డేంజర్ బెల్స్

ఊడిపోయిన కుడి కాల్వ గేటు

బయటపడిన ప్రాజెక్ట్ నిర్వహణలోని డొల్లతనం

కందుకూరు నియోజకవర్గ ప్రజల జీవనాడి రాళ్లపాడు ప్రాజెక్ట్ భద్రత గాలిలో దీపంలా మారింది. అటు సాగు, ఇటు తాగునీటికి కీలకమైన ఈ ప్రాజెక్ట్ నిర్వహణలో లోపాలు బయటపడుతున్నాయి. కుడి కాల్వ గేటు ఊడి కింద పడిపోవడం, పాతస్పిల్ వే గేట్లు నిర్వహణలో లేకపోవడం, ఆకస్మిక వరదలు సంభవిస్తే పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ భద్రతపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఊడిపడిన కుడికాల్వ గేటుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

- 15 ఏళ్లుగా నిర్వహణలో లేని పాత స్పిల్‌వే గేట్లు
- ఆ గేట్ల నుంచి భారీగా లీకవుతున్న నీరు
- వరిగడ్డి అడ్డం పెట్టి తాత్కాలికంగా అడ్డుకునే ప్రయత్నం
- ప్రస్తుతం నిర్వహణలో కొత్త స్పిల్‌వేలోని ఐదు గేట్లు మాత్రమే
- పూర్తి సామర్థ్య స్థాయికి ప్రాజెక్ట్ నీటి మట్టం
- ఆకస్మిక వరదలొస్తే ప్రాజెక్ట్‌కు ప్రమాదమే

కందుకూరు: రాళ్లపాడు ప్రాజెక్ట్ భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లాలోని కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని మాగాణి భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో మన్నేరు నదిపై రాళ్లపాడు ప్రాజెక్ట్ నిర్మాణం 1952లో ప్రారంభమై 1958 నాటికి పూర్తయింది. అప్పటి నుంచి నియోజకవర్గంలోని లింగసముద్రం, గుడ్లూరు, వలేటివారిపాళెం, కొండాపురం మండలాల్లోని గ్రామాల రైతులు సమృద్ధిగా పంటలు పండించుకున్నారు. అయితే 1993లో వచ్చిన వరదలకు ప్రాజెక్ట్ కట్టకు మొదటిసారి గండిపడింది. ఆ సమయంలో ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంతంలో ఊళ్లన్నీ మునిగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఆ తర్వాత ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపట్టిన ఏడాదికే మరోసారి తెగింది. ఈ ఘటన తర్వాత ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి కొత్త డిజైన్‌లు రూపొందించి పాత స్పిల్‌వేతో పాటు, కొత్త స్పిల్‌వేను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దాదాపు కొత్త, పాత స్పిల్‌వేల ద్వారా వరద నీటిని వదులుతున్నారు.

నిర్వహణలో లేని పాత స్పిల్‌వే గేట్లు

పాత స్పిల్‌వేలో 10 సాధారణ గేట్లతో పాటు, రెండు బురద గేట్లున్నాయి. ఈ గేట్లు దాదాపు గత 15 ఏళ్ల నుంచి నిర్వహణలో లేవు. వీటిని నిర్వహణలోకి తెచ్చే ప్రయత్నం ప్రాజెక్ట్ అధికారులు చేయడం లేదు. దీర్ఘకాలికంగా సరైన నిర్వహణ లేని ఈ గేట్లు అత్యవసర పరిస్థితుల్లో తెరుచుకునే పరిస్థితి లేదు. ఒక వేళ ఆ ప్రయత్నం చేసినా గేట్లకు ఆధారంగా ఉండే కౌంటర్ వెయిట్ దిమ్మెలు విరిగి కిందపడతాయనే అనుమానాలు ప్రాజెక్టు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాటి నిర్వహణలో అలా వదిలేశారు. గత దశాబ్ద కాలంగా ప్రాజెక్ట్‌లోకి సక్రమంగా నీరు రాకపోవడం, గేట్ల నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం ఈ గేట్ల నుంచి నీరు భారీగా లీకవుతోంది. ప్రాజెక్ట్‌లోకి వచ్చిన కొద్దిపాటి నీరు వృథాగా మన్నేరులో కలిసిపోతుంది. లీకేజీలకు తాత్కాలికంగా వరి గడ్డిని అడ్డుపెట్టి సీజన్ వరకు చేతులు దులుపుకుంటున్నారే కానీ.. సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదు. ప్రాజెక్ట్‌లోకి వరదనీరు వచ్చిన సమయంలో కొత్త స్పిల్‌వే ద్వారా నీటిని మన్నేరుకు వదులుతున్నారు.

ఊడిపడిన కుడి కాల్వ గేటు


ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మూడు రోజుల క్రితం కుడికాల్వ గేటు ఎత్తే ప్రయత్నం చేయగా అది ఊడి కిందపడిపోయింది. దీంతో ఆ గేటు మరమ్మతుల కోసం అధికారులు కుస్తీలు పడుతున్నారు. ప్రాజెక్ట్ నిండా నీరు ఉండడంతో గేటు మరమ్మతులు చేయడం నిపుణులకు ఇబ్బందికరంగా మారింది. మూడు రోజుల నుంచి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. గేటు నిర్వహణ దీర్ఘకాలికంగా సక్రమంగా లేకపోవడమే ఈ దుస్థితికి కారణం.

ఎండుతున్న దుక్కులు

దాదాపు రెండేళ్ల తర్వాత ప్రాజెక్ట్‌లోకి పూర్తి స్థాయిలో నీరు చేయడంలో ఆయకట్టు పరిధిలో రైతులు ఈ ఏడాది వరిసాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకుని వరినారు మడులు సిద్ధం చేసుకున్నారు. ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేస్తే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ప్రాజెక్ట్ కుడి కాల్వ గేటు ఊడిపడింది. దీంతో కాల్వకు నీరు వెళ్లడం లేదు. కుడి కాల్వ కింద దాదాపు 20 వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

ఆకస్మిక వరదలు వస్తే ప్రమాదమే

రాళ్లపాడు ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 24 అడుగులు (1.11 టీఎంసీలు). అయితే ప్రాజెక్ట్ భద్రత దృష్ట్యా 21 అడుగుల వరకే నీటిని నింపుతున్న పరిస్థితి ఉంది. ఆపై వచ్చే నీటిని మన్నేరుకు వదులుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు రావడంతో ప్రస్తుతం 20 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఇంకో అడుగు నీరు చేరితే ప్రాజెక్ట్ నిండుకుండలా మారుతుంది. ఆకస్మిక వరదల ప్రమాదం ప్రాజెక్ట్‌కు ఎప్పుడూ పొంచి ఉంది. ప్రాజెక్ట్ ఎగువన మన్నేరుపై నక్కలగండి, గండిపాళెం రిజర్వాయర్లతోపాటు, ప్రకాశం జిల్లాలోని మోపాడు రిజర్వాయర్ కూడా ఉంది. అవి నిండితే విడుదల చేసే నీరు అంతా రాళ్లపాడు ప్రాజెక్ట్‌కే వస్తుంది. ఇలా ఒక్కసారి ఊహించని విధంగా వరద వస్తే పరిస్థితి ఏమిటని ఊహించుకుంటుంటే వణుకు పుడుతోంది. ఆకస్మిక వరదలు వస్తే పాత, కొత్త స్పిల్‌వేలోని అన్ని గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తేనే ప్రాజెక్ట్‌కు భద్రత ఉంటుంది. ప్రస్తుతం పాత స్పిల్‌వేలోని 12 గేట్లు పైకి లేవడం లేదు. వీటిని లేపే సాహసాన్ని కూడా అధికారులు చేయడం లేదు.



రాళ్లపాడు ప్రాజెక్ట్



పాత స్పిల్‌వే లోని గేట్ల నుంచి లీకవుతున్న నీరు



కుడి కాల్వ కింద ఎండుతున్న దుక్కులు

ఉపాధి తిమింగలాలపై

వేటు పడేనా!

పేద ప్రజలకు ఉపాధి కల్పించేందుకు నిర్వహిస్తున్న ఉపాధి పనుల్లో అవినీతి తిమింగలాలపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి అవినీతికి పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్ ప్రభుత్వానికి సిఫార్సు చేయడంలో ఆ శాఖలో కలకలం రేగింది. వీరితోపాటు గతంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపైనా చర్యలు ఉంటాయా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

- అక్రమార్కులపై కేసుల నమోదుకు సిఫార్సు
- 2014-19 మధ్య టీడీపీ పాలనలో రూ.కోట్ల అవినీతి
- అప్పటి బాధ్యుల నుంచి రూ.4 కోట్ల మేర రికవరీ చేయాల్సి ఉంది
- ఇప్పటికీ కొనసాగుతున్న సిబ్బంది.. వారిపై చర్యలు లేనట్లేనా?

నెల్లూరు (పొగతోట): జిల్లాలో 4.30 లక్షలు జాబ్ కార్డులు కలిగిన కూలీలు ఉండగా, వీరిలో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలు నిత్యం 60 వేల నుంచి 70 వేల లోపే ఉన్నారు. కంచే చేను మేసిన చందంగా పనులు కల్పించాల్సిన సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. అధికార పార్టీ నేతలతో కలిసి ఉపాధి సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఆటో డ్రైవర్లు ట్యాక్సీ డ్రైవర్లు ప్రైవేట్ జాబ్‌లు చేస్తుండే వారి పేరిట జాబ్‌కార్డులు మంజూరు చేశారు. ఇతర రాష్ట్రాలు, పక్క జిల్లాల్లో నివాసం ఉంటున్న వారి ఆధార్ సేకరించి సింగిల్ బోగస్ జాబ్ కార్డులను సృష్టించారు. ఎస్టీ జాబ్ కార్డుల్లో ఓసీలను చేర్చి భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారు. కొడవలూరు మండలం తలమంచిలో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై గత వారంలో చర్యలు చేపట్టారు. నలుగురు సిబ్బందిపై వేటు వేశారు. రాపూరు మండలంలో సోషల్ ఆడిట్‌లో లక్షల రూపాయల అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో సిబ్బందిపై చర్యలు చేపట్టారు. కలువాయి మండలం చినగోపవరం పంచాయతీలో రూ.లక్షల అవినీతికి పాల్పడ్డారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలువాయి మండల ఎంపీడీఓకు పంచాయతీరాజ్ శాఖాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో అక్రమాలకు పాల్పడ్డ సిబ్బంది కేసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అలాంటి పనులకు మళ్లీ అనుమతులు

టీడీపీ నాయకులు, కార్యకర్తలు జేబులు నింపేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఉపాధి హామీ నిధులకు సంబంధించి పంట కుంటలు, ఇంకుడు గుంతలు మినీ గోకులాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసింది.

టీడీపీ హయాంలో రూ.కోట్లల్లో అవినీతి

2014- 2019 మధ్య టీడీపీ పాలనలో ఉపాధి పనుల్లో రూ.కోట్లల్లో అవినీతి జరిగింది. సోషల్ ఆడిట్‌లో సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు రికవరీలు ప్రతిపాదించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.4 కోట్లకు పైగా రికవరీ చేయాల్సి ఉంది. అవినీతికి పాల్పడ్డ సిబ్బంది అప్పటి టీడీపీ నాయకుల ప్రమేయంతో సిఫారసులు చేయించుకుని ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. పంట కుంటల పేరుతో భారీ అవినీతికి పాల్పడ్డారు. టీడీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా 2 వేలకు పైగా పంట కుంటలు మంజూరు చేశారు. దీనికి సంబంధించి ఒక్కో పంట కుంట నిర్మాణానికి రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులు కేటాయించారు. ఉపాధి కూలీలతో పనులు చేయించాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కుమ్మక్కై యంత్రాలతో పనులు చేయించి రూ.కోట్ల ఉపాధి నిధులను స్వాహా చేశారు. కలువాయి మండలానికి సంబంధించి 200కు పైగా పంట కుంటలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఒకటి, రెండు మినహా పంట కుంటలు కనుమరుగయ్యాయి. బిల్లులు మంజూరు కావడంతో పంట కుంటలను పూడ్చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

రాబోవు రోజుల్లో వీటి ద్వారా కార్యకర్తలు అధికార పార్టీ నాయకులు ఉపాధి నిధులు స్వాహా చేసే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం

కలువాయి మండలం చిన్నగోపవరంలో ఉపాధి హామీ నిధుల్లో అవినీతి జరిగింది. దీనికి సంబంధించి ఉపాధి హామీ సిబ్బందిపై కేసులు నమోదు చేయమని పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు అందాయి. క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశాం.

– గంగా భవానీ, డ్వామా పీడీ

'ఒత్తిళ్లు ఉన్నాయ్.. వదిలేయండి ప్లీజ్'

- మరోమారు భూములు దున్నే ప్రయత్నాన్ని అడ్డుకున్న గ్రామస్తులు
- కీలక ఆధారాలతో లోకాయుక్తను ఆశ్రయించేందుకు సిద్ధం
- అక్కరాజువారి కండ్రిగ భూముల వ్యవహారంలో చేతులెత్తేస్తున్న అధికారులు

బిట్రగుంట: బోగోలు మండలం అక్కరాజువారికండ్రిగ భూముల వ్యవహారం చినికిచినికి గాలివానగా మారుతోంది. స్థానికులు అటవీ, ఈనాం భూములుగా పేర్కొంటూ మేతపోరంబోకుగా వినియోగించుకుంటున్న భూముల్లో స్థానికేతరులు సాగుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకుని సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం మరోమారు యంత్రాలతో భూమిని దున్నేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు మళ్లీ అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులు 'పైనుంచి ఒత్తిళ్లు ఉన్నాయ్.. మేమేం చేయలేం మమ్మల్ని వదిలేయండి ప్లీజ్' అంటూ అధికారులు సర్ది చెప్పే ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు మండి పడుతున్నారు. సుమారు 400 మంది గ్రామస్తులు తరతరాలుగా సాగు చేసుకుంటూ, మూగజీవాలకు మేతపోరంబోకుగా వినియోగించుకుంటున్న భూములను కాకినాడకు చెందిన వ్యక్తుల పేర్లతో ఎలా మారిపోయాయంటూ ప్రశ్నిస్తున్నారు. భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి 60 ఎకరాలకుపైగా దొంగ రిజిస్ట్రేషన్లు చేసినా పట్టించుకోకుండా చోద్యం చూస్తుండడం దారుణమంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ భూములకు సంబంధించిన పాత రికార్డులు, తర్వాత అధికారులు తారుమారు చేసిన రికార్డులతో లోకాయుక్తను ఆశ్రయించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు పట్టించుకోకపోయినా లోకాయుక్తను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అధికారులకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, పోలీసులు సైతం అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోతున్నారు. ఇలాంటి వారికి ల్యాండ్ గ్రాబింగ్ చట్టాలు వర్తించవా అని ప్రశ్నిస్తున్నారు.

బాల్య విద్య మిథ్య

- బుడతలకు బుక్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ లేవు
- ఆట పాటల్లేవ్.. బోధనా లేదు
- కూరగాయలు, నిత్యావసరాల ధరల మోత
- ఆరు నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోని ప్రభుత్వం

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య విద్య మిథ్యగా మారింది. ఆట పాటలతో విద్యాబోధన అందించాల్సిన కేంద్రాల్లో పుస్తకాలు కరవయ్యాయి. చిన్నపాటి గాయమైనా.. నలత తలెత్తినా.. ఫస్ట్ ఎయిడ్ మందుల కరువయ్యాయి. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలవుతున్నా ఈ ఏడాదికి సంబంధించి ప్రీ స్కూల్ పుస్తకాలు, ప్రథమ చికిత్స కిట్లు ఇప్పటికీ రాని పరిస్థితి. మరో వైపు బియ్యం, నూనె, పప్పులు ప్రభుత్వం అందిస్తున్నప్పటికీ మిగతా ఫలసరుకుల ధరల మోత కార్యకర్తలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం తింటున్న చిన్నారులు

కావలి: చిన్నారుల సంరక్షణ, సమగ్ర వికాసానికి దోహదపడాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్యకు తోడ్పడే పుస్తకాలు రానందున ఆటపాటలతో అందించే విద్య అటకెక్కింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తుస్తోంది. ఏటా జూన్ నాటికి పీపీ-1 పేరిట స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యాక్షన్, స్టోర్ పుస్తకాలు అందాల్సి ఉంది. కొత్త పుస్తకాలు అందకపోవడంతో పాత వాటితో నెట్టుకొస్తున్నారు. కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించి ఆ తర్వాత నేరుగా ఒకటో తరగతిలో ప్రవేశం పొందేలా అధికారులు గతంలో చర్యలు తీసుకునే వారు. గతంలో అందించిన పూర్వ ప్రాథమిక పుస్తకాల్లో ఆంగ్ల అక్షరాలు, అంకెలు, ఆకట్టుకునే చిత్రాలు, ఆటపాటలు, పద్యాలతో నెలలు, వారాలు, రోజులు, బొమ్మలు గీయడం, పాటలు పాడడం వంటి అంశాలు ఉండేవి. వీటిని చిన్నారులకు అందించడంతో ఎంతో ఉత్సాహంగా గడిపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

పోషకాహారానికి ధరల భారం

జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ధరల భారాన్ని మోయాల్సి వస్తోంది. మెనూకు తగ్గట్టు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలంటే అప్పులు చేయాల్సి వస్తోంది. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు అమాంతంగా పెరగడంతో మెనూ అమలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. కేంద్రాలకు ప్రభుత్వమే రేషన్ బియ్యం, నూనె, కందిపప్పు, పాలు, గుడ్లు సరఫరా చేస్తోంది. ప్రతి నెలా రేషన్ దుకాణాలకు వెళ్లి కంది పప్పు, బియ్యం తెచ్చుకోవాలి. రవాణా చార్జీలు కార్యకర్తలే భరించుకోవాలి. కూరగాయలు, వంట సామాన్లు కార్యకర్తలే పెట్టుబడిగా పెట్టుకొని వంట తయారు చేయాలి. ఒక్కో చిన్నారికి రూ.1.10 చొప్పున ఇస్తారు. నెలకు గ్యాస్‌కు రూ.300 మాత్రమే ఇస్తారు. మార్కెట్లో ధరలు చూస్తే మండిపోతున్నాయి. టమోటా కిలో రూ.70, ఉల్లిపాయలు కిలో రూ.80 ధర ఉంటే.. సరుకుల ధరలు మండిపోతున్నాయి. పెట్టుబడిగా పెట్టిన నగదు కూడా నెలనెలా ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కార్యకర్తలు సతమతమవుతున్నారు.

ఇంకా అందని మెడికల్ కిట్లు

అంగన్‌వాడీ కేంద్రాలను మెడికల్ కిట్ల కొరత వేధిస్తోంది. చిన్నారులు ఆటపాటల్లో ఉన్నప్పుడు స్వల్ప అనారోగ్యం, చిన్న చిన్న గాయాలకు వెంటనే వైద్య సేవలందించేలా ఫస్ట్ ఎయిడ్ (ప్రాథమిక చికిత్స మందులు) కిట్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కిట్‌లో పది రకాలకు పైగా ఔషధాలుంటాయి. పారాసిటమాల్ సిరప్, ఐరన్ మాత్రలు, అయోడిన్, సిల్వర్ సల్ఫాడైజీన్, క్లోరోఫినరామిన్, మాలియాట్, ఫురాజోలిడిన్, హ్యాండ్ శానిటైజర్, రోలర్ బ్యాండేజ్, నియోమైసిన్ అయింట్మెంట్, దూది, సిప్రోఫ్లాక్సిన్, చుక్కల మందు, బెంజయిల్, బెంజోయేట్‌తోపాటు మరి కొన్ని సిరప్‌లు ఉంటాయి. ఈ ఏడాది జూన్‌లో మెడికల్ కిట్‌లు అందించాలి. ప్రభుత్వం ఇంత వరకు అందించలేదు. అవసరమైతే చిన్నారులకు కార్యకర్తలే తమ డబ్బుతో మందులు కొని ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లు	12
అంగన్‌వాడీ కేంద్రాలు	2,705
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	229
చిన్నారులు 0-6 నెలలు	13,954
6-12 నెలలు	12,804
(1-3 సంవత్సరాలు)	49,015
(3-6 సంవత్సరాలు)	48,681

మళ్లీ అదే నిర్లక్ష్యం.. చిన్నచూపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు బాటలు వేసింది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు పరిమితమైన ఎన్నో సౌకర్యాలను సర్కారు బడుల్లో కల్పించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు తలకిందులయ్యాయి. డిజిటల్ విద్యకు మంగళం పాడే దిశగా అడుగులేస్తోంది. పేద పిల్లలు చదివే స్కూళ్లను బలహీనపరిచి కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు పెద్దపీట వేస్తోందన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో విప్లవాత్మక మార్పులు
- డిజిటల్ విద్యకు పెద్దపీట
- నేడు ఒక్కొక్కటిగా మాయం
- విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వని వైనం


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు, చిత్రంలో ఉపాధ్యాయులు (ఫైల్)

జిల్లాలో..	
ప్రభుత్వ పాఠశాలలు :	విద్యార్థుల సంఖ్య :
2,604	1.81 లక్షలు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు డిజిటల్ విద్యను గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లో తొలివిడతలో 1,324 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లు, 428 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీల ద్వారా విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. ఇంకా 8వ తరగతి విద్యార్థులకు 2022 – 23 విద్యా సంవత్సరంలో 18,513 ట్యాబ్‌లు, 2023 – 24లో 17,748 ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. బోధించే టీచర్లకు కూడా వాటిని అందించారు. ట్యాబ్‌లలో బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేశారు. విద్యార్థి తరగతి గదిలో విన్న తర్వాత ఇంటికెళ్లి ఒకసారి ట్యాబ్‌లో మళ్లీ చదువుకునే విధంగా అవకాశం కల్పించారు. ఇంకా జిల్లాలోని 41 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేశారు. పోటీ పరీక్షల్లో రాణించేలా బోధన అందించేలా చర్యలు చేపట్టారు. ఇంకా 30 హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేసి ఇంటర్ విద్యను అమలు చేశారు. విద్యార్థులకు 8వ తరగతి నుంచే సీబీఎస్‌ఈ సిలబస్‌నే బోధనను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం ఆ పద్ధతిలో పది పరీక్షలు రాయాల్సి ఉంది. టోఫెల్ పరీక్ష విధానంలో కూడా శిక్షణ ఇచ్చారు.

రద్దు దిశగా..

గత ప్రభుత్వం తెచ్చిన విప్లవాత్మక మార్పులను రద్దు చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే సీబీఎస్ సిలబస్‌ను రద్దు చేసి పది పరీక్షలను రాష్ట్ర సిలబస్‌తోనే రాయాలని ఆదేశించింది. ఇప్పటి వరకు ఇంగ్లిష్ మీడియంలోనే జరుగుతున్న పబ్లిక్ పరీక్షలను ఈ విద్యా సంవత్సరం ఏ మీడియంలోనైనా రాయొచ్చని చెప్పింది. విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారనే సాకుతో హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్‌తో బోధిస్తున్న విధానానికి చెక్ పెట్టనున్నారు. హైస్కూల్ స్థాయి నుంచి ఈ విధానాన్ని తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. టోఫెల్ పరీక్ష విధానాన్ని రద్దు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే పిల్లల దగ్గర ఉన్న వాటిల్లో కొన్ని పాడైనా మరమ్మతులు చేయడం లేదు. జిల్లాలో మిగిలిన పాఠశాలల్లో ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడలేదు. టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారి ప్రభుత్వ బడులపై నిర్లక్ష్యం చేస్తారనే మాట ఉంది. దీనిని రుజువు చేసేలా కార్పొరేట్‌కు కొమ్ము కాస్తున్న కూటమి ప్రభుత్వంపై పలువురు విద్యావేత్తలు మండిపడుతున్నారు.

ట్యాబ్‌లు, ఐఎఫ్‌పీలు ఇంకా రాలేదు

ఈ విద్యా సంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇంకా రాలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో మిగిలిన పాఠశాలలకు ఐఎఫ్‌పీలు రావాల్సి ఉంది. అవి కూడా ఇంకా రాలేదు. స్మార్ట్ టీవీలపై ఎలాంటి సమాచారం లేదు. సీబీఎస్‌ఈ చదువుతున్న విద్యార్థులకు ఇటీవల ఒక టెస్ట్ నిర్వహించారు. ఈ ఫలితాల్లో మెరుగ్గా లేరని సీబీఎస్‌ఈలో పరీక్ష విధానాన్ని రద్దు చేసి స్టేట్ సిలబస్‌లోనే రాయాలని ఆదేశాలొచ్చాయి.

– బాలాజీరావు, డీఈఓ


పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఫైల్)

క్లుప్తంగా

ఊటుకూరు వీఆర్వోపై దౌర్జన్యం

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామ వీఆర్వో చెంచురెడ్డిపై కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో ఆయన మంగళవారం తహసీల్దార్ రమాదేవి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విలేకరులకు వివరాలు వెల్లడించారు.. చెంచురెడ్డి పొదలకూరులో నివాసం ఉంటున్నారు. రోజూ ఉదయం ఊటుకూరు సచివాలయానికి చేరుకుని విధులు నిర్వర్తిస్తుంటారు. మంగళవారం మంచు శేషాద్రి, వెంకటసుబ్బయ్య అనే అన్నదమ్ములకు ఆయన ఫోన్ చేసి గ్రామంలోని భూ వివాదంపై వారితో మాట్లాడారు. 145 సెక్షన్ ఉందని, వివాదం నెలకొన్న భూమి వద్దకు వెళ్లొద్దని చెప్పాడు. దీంతో వారిద్దరూ వీఆర్వోను తిట్టారు. అంతటితో ఆగకుండా సచివాలయానికి వెళ్లి గొడవకు దిగారు. 'మా భూమిలోకి దిగొద్దనేందుకు నువ్వెవరు? పొదలకూరుకు వచ్చి కొడతాం. ఎవరు అడ్డొస్తారో చూస్తాం' అంటూ చెంచురెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్టేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఉద్యోగులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపేశారు. ఈ విషయంపై వీఆర్వో అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఆరా తీస్తున్నారు.

పోలీసుల అదుపులో మల్లికార్జునరావు

విజయవాడ స్పోర్ట్స్: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడనే అభియోగంపై నెల్లూరుకు చెందిన నక్క మల్లికార్జునరావు అనే వ్యక్తిని విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్‌ను ఫోన్‌లో అసభ్య పదజాలంతో మల్లికార్జునరావు దూషించినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఇందిరా గాంధీ స్టేడియం వద్ద నుంచే ఫోన్‌లో మాట్లాడినట్లు తమ విచారణలో వెల్లడైనట్లు పోలీసులు చెబుతున్నారని సమాచారం.

చిన్న కుటుంబం.. పెద్ద కష్టం

- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- దాతల సాయం కోసం ఎదురుచూపులు


అనారోగ్యంతో బాధపడుతున్న షాన్‌వాజ్

ఆత్మకూరు: ఓ నిరుపేద కుటుంబానికి అనారోగ్య రూపంలో పెద్ద కష్టం వచ్చింది. ఇంటి యజమాని గతనెల రోజులుగా మంచానికే పరిమితం కావడంతో పోషణ కష్టతరమైంది. వైద్యం చేయించుకునేందుకు లక్షలాది రూపాయల ఖర్చును భరించలేని స్థితిలో 'ఆపన్న హస్తం' కోసం ఎదురు చూస్తున్నారు.

పట్టణంలోని చావడి సెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ షాన్‌వాజ్, తోపుడు బండిపై పండ్లు, కూరగాయలు, చిన్న వస్తువులు అమ్మి కుటుంబాన్ని పోషించేవాడు. అతని భార్య గౌసున్నీసా బీడీలు చుట్టి వచ్చే డబ్బుతో భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. కొంతకాలం క్రితం షాన్‌వాజ్‌కు ఊపిరితిత్తుల సమస్య రావడంతో తొలుత ఆత్మకూరు, తర్వాత నెల్లూరుల్లోని ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. డబ్బు ఖర్చయినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాలని నెల్లూరు డాక్టర్లు సూచించారు. అక్కడికెళ్లగా నిత్యం ఆక్సిజన్ సపోర్టు ఉండాల్సిందే. లేకపోతే షాన్‌వాజ్ జీవించడం కష్టమని వైద్యులు తెలిపారు. ఆక్సిజన్ సిలిండర్ కోసం నిత్యం ఎంతో ఖర్చవుతోంది. వీరికి సొంత ఇల్లు సైతం లేదు. ఆత్మకూరులో అద్దెకు ఉంటున్నారు. ఇంటి యజమాని మానవతా దృక్పథంతో అద్దె వసూలు చేయకుండా వారికి కొంత సహకారం అందిస్తున్నాడు. అయితే నెలకు సుమారు రూ.40 వేలు వైద్యానికే ఖర్చు అవుతోందని, రిస్క్‌తో కూడిన ఖరీదైన శస్త్రచికిత్స చేయించాలంటే రూ.లక్షలు అవసరమని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దాతలు ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. సాయం చేయాలనుకునే వారు 99483 25563 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

కాపురానికి రాలేదనే కోపంలో..


మాట్లాడుతున్న కావలి డీఎస్పీ శ్రీధర్, చిత్రంలో పోలీసులు

- భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

కావలి: ఉదయగిరిలో ఈనెల 3వ తేదీన ఇందిర అనే వివాహితను దారుణంగా హత్య చేసిన ఘటనలో ఆమె భర్త మస్తాన్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయగిరికి చెందిన కట్టా మస్తాన్‌కు అదే ప్రాంతానికి చెందిన ఇందిరతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల వయసున్న బాబు ఉన్నాడు. మద్యానికి బానిసైన మస్తాన్ తరచూ భార్యతో గొడవపడేవాడు. మూడు నెలల క్రితం ఇంట్లో నుంచి తరిమేయడంతో ఇందిర తన తల్లి ఇంటికెళ్లి అక్కడే ఉంటోంది. మళ్లీ కాపురానికి రావాలని మస్తాన్ పిలిచినా ఆమె రాకపోవడంతో కోపం పెంచుకున్నాడు. 3వ తేదీన అత్త ఇంట్లో ఆడుకుంటున్న తన కుమారుడిని మస్తాన్ ఇంటికి తీసుకెళ్లాడు. బాబు కోసం ఇందిర భర్త వద్దకు వెళ్లగా కాపురానికి రావాలని మళ్లీ గొడవ పెట్టుకున్నాడు. ఇందిర ససేమిరా అనడంతో ఇంట్లో దాచి ఉంచిన కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. భార్య చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత పారిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. దుత్తలూరు మండలం వెంకటంపేట గ్రామంలోని ఓ దేవాలయం వద్ద ఉన్నాడన్న సమాచారంతో ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, ఎ.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో దొంగల హల్‌చల్

- కారు అద్దాలు పగులగొట్టి నగదు బ్యాగ్‌ల అపహరణ
- తమిళనాడుకు చెందిన ముఠాగా గుర్తింపు
- పోలీసుల అదుపులో ఇద్దరు


ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పగిలిపోయిన కారు అద్దం

నెల్లూరు(క్రైమ్): నగరంలో దొంగలు హల్‌చల్ చేశారు. చిన్నబజార్, సంతపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్క్ చేసి ఉన్న కారు అద్దాలను పగులగొట్టి నగదు బ్యాగ్‌లను అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. పొగతోట నాలుగో వీధిలో సత్యనారాయణ కుటుంబం నివాసం ఉంటోంది. సత్యనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెంచలమ్మ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో చికిత్స కోసం కుమారుడు రాహుల్‌బాబు, కోడలితో కలిసి కారులో హాస్పిటల్‌కు వెళ్లారు. సమీపంలో వాహనాన్ని పార్క్ చేశారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు కారు అద్దాన్ని పగులగొట్టి హ్యాండ్ బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్సైలు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హ్యాండ్ బ్యాగ్‌లో రూ.60 వేల నగదు, క్రెడిట్, డెబిట్‌కార్డులు ఉన్నాయని రాహుల్ బాబు ఫిర్యాదు చేయగా సోమవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

నర్తకి సెంటర్ సమీపంలో..

నగరానికి చెందిన హర్ష ఈనెల 9వ తేదీ రాత్రి పని నిమిత్తం నర్తకి సెంటర్‌కు వచ్చాడు. తన కారును పార్క్ చేసి సమీపంలోని షాపునకు వెళ్లాడు. ఇంతలో గుర్తుతెలియని దుండగులు కారు అద్దాన్ని పగులగొట్టి బ్యాగ్‌ను అపహరించుకెళ్లారు. పని ముగించుకుని కారు వద్దకు వచ్చిన హర్షకు బ్యాగ్ కనిపించకపోవడంతో సంతపేట పోలీసులకు సమాచారం అందించాడు. అందులో సుమారు రూ.10 వేల నగదు, ఇతర విలువైన డాక్యుమెంట్లు ఉన్నట్లు చెప్పాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించి చిన్నబజారు, సంతపేట పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. నిందితులు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు.

ముఠా పాగా

డిసెంబర్‌లో పండగ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో తమిళనాడు రాష్ట్రం రాంజీనగర్‌కు చెందిన దొంగల ముఠా ఊళ్లపై విరుచుకుపడి అందిన కాడికి దోచుకెళ్తుంటుంది. దీంతో నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. రాంజీనగర్, తిరుచ్చిలకు చెందిన ముఠాలు దొంగతనాల్లో సిద్ధహస్తులు. నిందితులు బ్రాండెడ్ దుస్తులు, బూట్లు ధరించి చూసేందుకు ఉన్నత ఉద్యోగులుగా, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా కనిపిస్తారు. రహదారులపై రెక్కీ వేస్తూ అదును చూసి దొంగతనాలు చేసి ఉన్నదంతా ఊడ్చేస్తారు. ప్రధానంగా రోడ్లపై పార్క్ చేసిన కారు అద్దాలను పగులగొట్టి విలువైన వస్తువులను అపహరిస్తుంటారు. పండగ సీజన్ ప్రారంభమవడంతో రాంజీనగర్‌కు చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన ముఠా నెల్లూరు నగరంలో పాగా వేసి నేరాలకు పాల్పడుతోందని పోలీసులు భావిస్తున్నారు.

దొంగతనం చేస్తారిలా..

ముఠా సభ్యులు నగరంలో తిరుగుతూ దొంగతనానికి అనువుగా ఉన్న ప్రాంతాల్లో మాటేస్తారు. కారు పార్క్ చేసిన వెంటనే ముఠాలోని ఒకరు దాని దగ్గర, మరొకరు కొద్దిదూరంలో, మిగిలిన వారు పరిసర ప్రాంతాలను గమనిస్తుంటారు. కారులోని వారు తాళం వేసి వెళ్లగానే నిందితుల్లో ఒకరు అద్దంలో నుంచి బ్యాగ్‌లు, ఇతరత్రా ఏమైనా ఉన్నాయా అని గమనిస్తారు. బ్యాగ్‌లు ఉంటే వెంటనే పదునైన ఆయుధంతో అద్దాలు ధ్వంసం చేసి అక్కడి నుంచి వెళ్లిపోతారు. కొద్దిదూరంలో ఉన్న మరో సభ్యుడు వచ్చి వాహనంలోని బ్యాగ్‌ను తీసుకెళ్లగానే మిగిలిన వారు అక్కడి నుంచి జారుకుంటారు. అనంతరం అందరూ కలిసి పరారై చోరీ సొత్తును సమానంగా పంచుకుంటారు. తర్వాత మరో ప్రాంతానికి వెళ్లి ఇదే తరహాలో నేరాలకు పాల్పడుతుంటారు. నగరంలో రెండు ఘటనలు చోటుచేసుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సాంకేతికత ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి నగరంలో జల్లెడ పట్టారు. మంగళవారం వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిచ్చిన వివరాల మేరకు మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 112కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచిస్తున్నారు.

రెవెన్యూ సదస్సులో రైతుల ఆవేదన


తాటిపర్తిలో రెవెన్యూ సదస్సు

పొదలకూరు: 'మా పేర్లపై పొలాలు అదనంగా ఉన్నాయని వెబ్‌ల్యాండ్‌లో చూపడంతో పథకాలు అందడం లేదు' అని కొందరు రైతులు రెవెన్యూ సదస్సులో ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో మంగళవారం సదస్సును డిప్యూటీ తహసీల్దార్ సురేఖ నిర్వహించారు. మూడు అర్జీలు అందాయి. వాటిని అందజేసిన రైతులు తమ పేర్లపై పొలం ఉన్నట్టుగా చూపుతుండటంతో పింఛన్ ఆగిపోయినట్టు పేర్కొన్నారు. ఈ సమస్యపై రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని జరగలేదని ఎత్తపు మస్తాన్‌రెడ్డి అనే వృద్ధుడు ఆవేదన చెందాడు. వీఆర్వో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 89
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 168
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 188
లేయర్ చికెన్	: 187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12

బ్యాంక్ ఉద్యోగం పేరిట మోసం

- నిందితులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బ్యాంక్ ఉద్యోగం పేరిట రూ.లక్షలు తీసుకుని మోసగించిన వ్యక్తులపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పడారుపల్లిలో దేవానందం కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమార్తె హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతోంది. దేవానందంకు విక్రమ్ నగర్‌కు చెందిన సువర్ణరాజు ద్వారా జి.బెనర్జీ అనే వ్యక్తి ఎస్‌బీఐ ఉన్నతాధికారిగా పరిచయమయ్యాడు. మీ కుమార్తెకు బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని, గతంలో సువర్ణరాజు కుమార్తెకు నెల్లూరు బారకాస్‌లోని ఎస్‌బీఐలో జాబ్ ఇప్పించానని బెనర్జీ నమ్మబలికాడు. అతని మాటల్ని నమ్మిన దేవానందం ఉద్యోగ నిమిత్తం రూ.20 లక్షలను బెనర్జీ దంపతులకు ఇచ్చాడు. అనంతరం ఫోన్‌పేలో కొంత నగదు పంపాడు. బెనర్జీ సూచనల మేరకు తన కుమార్తెను బ్యాంక్ ఉద్యోగానికి అవసరమైన శిక్షణ కోసం హైదరాబాద్‌లోని రేస్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పించాడు. ఈ సమయంలో ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.4 లక్షలు, ఖమ్మంకు చెందిన మరో వ్యక్తి వద్ద రూ.6 లక్షలు తీసుకుని బెనర్జీ మోసగించాడని తెలిసింది. సువర్ణరాజు, బెనర్జీ దంపతులు తమను పథకం ప్రకారం మోసగించారని తెలుసుకున్న దేవానందం వారిని నిలదీయగా చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు నిందితులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

67 మద్యం బాటిళ్ల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని వేర్వేరు చోట్ల మంగళవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నందిపాడు కూడలిలో బి.లక్ష్మీనరసయ్య వద్ద 10 బాటిళ్లు, దుత్తలూరు పంచాయతీ కమ్మవారిపాళెం వద్ద నాగరాజు అనే వ్యక్తికి సంబంధించిన 35 బాటిళ్లను గుర్తించారు. వాటిని, నాగరాజుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ పూర్ణకుమార్, సిబ్బంది శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమణయ్య పాల్గొన్నారు.

- జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలో అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక మంగళవారం తెలిపారు. గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. జలదంకి దళితవాడకు చెందిన నేలపాటి వెంకమ్మ వద్ద పది, మోటుపల్లి కోటయ్య వద్ద 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.